# నిలకడ నేర్పిన నీల



నీల మహా అల్లరిది.

నిద్రపోయేటప్పుడు తప్ప ఇంకెప్పుడూ క్షణంసేపు కాలు కుదురుగా ఉంచదు. ఎంతసేపూ అటూఇటూ పరుగులు పెట్టుంటుంది. కుందేలువలె గంతులు వేస్తుంటుంది. నిత్యమూ వసపిట్టల్లే లొడలొడ వాగుతూంటుంది.

ఆ పిల్ల అల్లరి చూసి, “క్షణంసేపు నిలకడగా ఉండవు. పదేళ్లు దాటుతున్నా ఇంకా నీకు కుదురు ఎప్పుడు వస్తుందే నీలా? అంటూ వాళ్ళ అమ్మే కాదు.., ఇంట్లో అందరూ

అదే మాట అంటూంటారు. అయినా... అవేవీ పట్టించుకోకుండా ఎప్పటిలాగే గంతులు వేస్తూనే ఉంటుంది నీల.

నీల వాళ్ళ నానమ్మ ముసలామె. ఆమె సాధారణంగా తన పనులన్నీ నీలకే అప్పచెప్తుంటుంది. తప్పనిసరి అయినప్పుడు- విధిలేక అయిష్టంగా పనులు చేస్తుంటుంది నీల. చేస్తున్నంతసేపూ ముసలామెను తొందరపెట్తూనే ఉంటుంది. అది చూసి ఆ ముసలామె అంటుంది- "నిలకడ లేని పిల్లవు... నువ్వెలా పుట్టావే! అంటూ.

నీల అత్త- అంటే... ఆ ముసలామె కూతురు కూడా ఆ ఊళ్లోనే ఉంటోంది. పాపం... ఆమె చాలాకాలంగా మంచానపడి ఉంది. అందువల్ల వారానికొకసారి ప్రతి ఆదివారం నీలను వెంటపెట్టుకుని లోకల్ రైలు మీద వెళ్లి వస్తుంటుంది ముసలామె.

వీళ్ళిల్లూ, వాళ్ళిల్లూ కూడా రైలుస్టేషన్‌లకి దగ్గర్లోనే ఉన్నాయి. అందువల్ల రైలు ఎక్కడానికీ, దిగిన తర్వాత కూతురు ఇంటికి వెళ్లడానికీ నడిచే వెళ్తుంటారు. అప్పుడు నీల ఆ ముసలామె చేయి పట్టుకొని తీసుకువెళ్తుంటుంది.

నడుస్తున్నంతసేపూ తొందరగా నడవమని బామ్మని కంగారుపెట్తుంది. నీల వాళ్ళ అత్తయ్య ఇంటికి వెళ్లాక కూడా తొందరగా ఇంటికి వెళ్లాలని గోల చేస్తుంది. అది చూసి వాళ్ళ అత్తయ్యవాళ్ళు కూడా "నీలా... నీకు నిలకడ ఎప్పుడు వస్తుందే? నీ అరికాళ్లలో చక్రాలు ఉన్నాయేమో! అంటూంటారు.

ఆరోజు శ్రావణ శుక్రవారం!

నీల స్కూల్‌కి సెలవు. పండగ కలిసివస్తుందనీ, సెలవుకూడా ఉందనీ ఆరోజు ముసలామె నీలను వెంటపెట్టుకుని కూతురుని చూడడానికి బయలుదేరింది.

అయిష్టంగా వెంట వెళ్లింది నీల.

పండుగరోజు కనుక కూతురి దగ్గర ఎప్పటికంటె ఎక్కువసేపు గడిపిందామె. ఆమె అక్కడ ఉన్నంతసేపూ... కాళ్లకింద నిప్పులు పోసినట్లుగా "పోదాం...పోదాం..! అంటూ కంగారుపెట్టింది నీల.

"అబ్బబ్బ... నీలకి ఈ జన్మకి నిలకడ రాదురా బాబూ..! అని విసుక్కుంది ముసలామె.

వాళ్ళు రైలుస్టేషన్‌కి వచ్చేసరికి సాయంత్రం ఐదు అయింది.

స్టేషన్‌కి దగ్గర్లోనే బాలాత్రిపుర సుందరి అమ్మవారి గుడి ఉంది. ఆరోజు శ్రావణ శుక్రవారం కావడంతో గుళ్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి విశేష పూజలు చేస్తున్నారు.

"ఇంత దూరం వచ్చాం. పండగ పూట అమ్మవారి దర్శనం చేసుకుని వెళ్దాం రావే! అంటూ ఆలయం వైపు నడిచింది ముసలామె.

"ఏమిటి బామ్మా... ఏదో ఒకటి చెప్పి ఆలస్యం చేస్తుంటావు! అంటూ విసుక్కుంటూ తప్పనిసరిగా ఆమెతో వెళ్లింది నీల.

అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి, దండం పెట్టుకొని బయటకు వచ్చారు ఇద్దరూ.

"కాసేపు కోనేరు గట్టు మీద కూర్చుని పోదాం. ఇక్కడ ఎంత ప్రశాంతంగా ఉందో చూడు! అంటూ అటు నడిచింది ఆవిడ.

"బామ్మా... రైలు వచ్చే టైమైంది. ఇది తప్పితే మళ్లీ గంట వరకు బండి లేదు! అంటూ తొందరపెట్టింది నీల.

ఇంతలో... స్టేషన్‌కి బండి రానే వచ్చింది.

అక్కడ అది మూడు నిమిషాలు మించి ఉండదు.

"బామ్మా... బండి వచ్చేసింది! అని గట్టిగా అరిచింది నీల.

"ఉండవే... నిలకడలేని పిల్లా! కోనేటి నీళ్లు నెత్తిన జల్లుకుని వస్తాను అంటూ మెట్లు దిగి కోనేటిలో కాళ్లు కడుక్కుని నెత్తిన నీళ్లు చల్లుకొని వచ్చింది ఆమె.

వాళ్ళు స్టేషన్ సమీపిస్తుండగానే బండి వెళ్లిపోయింది.

నీల గోల పెడ్తూనే ఉంది.

బండి వంద గజాలైనా ముందుకి వెళ్లిందో, లేదో... బ్రహ్మాండమైన చప్పుడూ, హాహాకారాలూ వినిపించాయి. ఎదురుగా మహా వేగంగా వస్తున్న మెయిల్- లోకల్ ట్రైన్‌ని గుద్దేసింది. లోకల్ బండి ఇంజన్, దాని వెనకున్న రెండు బోగీలూ నుగ్గునుగ్గు అయ్యాయి. అవి రెండూ లేడీస్ కంపార్ట్‌మెంట్స్. వాటిలో ఎవరూ మిగలలేదు.

ఆ విభ్రాంతి నుంచి తేరుకున్నాక, "చూశావా అమ్మా... అమ్మవారి అనుగ్రహం! ఆ చల్లని తల్లిని దర్శించుకోకుండా వెళ్లి ఉంటే మనం ఆ లేడీస్ బోగీల్లోనే ఎక్కి ఉండేవాళ్ళం. ఈపాటికి పరలోకం చేరి ఉండేవాళ్ళం! అంది ముసలామె.

మొదటిసారిగా నిలకడ వచ్చింది నీలకు. అమ్మవారి గుడి వంక చూస్తూ మనస్సులోనే ఆ దేవికి నమస్సులు అర్పించింది.

*– జాగ్రతి వార పత్రిక... 15–21 మార్చి ' 93*